ప్రజాశక్తి

సోమవారం 12 డిసెంబర్ 2022

5

అల్లూరి సీతారామరాజు



సుంకరమెట్ట రోడ్డులో ట్రాఫిక్ జామ్

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయ మండలం సుంకరమెట్ట కాఫీ తోటల ఘాట్ రోడ్డుపై ఆదివారం ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. శని, ఆదివారం సెలవు రోజు కావడంతో మాండూస్ తుఫాన్ సైతం లెక్క చేయకుండా దేశ విదేశాల నుంచి వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. దీంతో రోడ్డుపై అర్ధగంట పాటు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. రాకపోకలు స్తంభించి పోయాయి. వెంటనే అరకు పోలీసు సర్కిల్ ఇన్స్పెక్టర్ జీడి బాబుకు స్థానికులు సమాచారం అందించారు. సీఐ తక్షణమే స్పందించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. దీంతో వాహనాలు యధావిధిగా రాకపోకలు కొనసాగించాయి.




నిలిచిన వాహనాలు

తహశీల్దార్ ఆత్మహత్యకు కారకులెవరు ?

- చేపట్టని శాఖాపరమైన విచారణ
- పిఒ తీరుపై సర్వత్రా విమర్శలు

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా పెదబయలు మండల తహశీల్దార్ శ్రీనివాసరావు మృతి చెందిన ఘటన విశాఖ ఉమ్మడి జిల్లా రెవెన్యూ వర్గాల్లో సంచలనం రేపింది. ఆయన మృతి చెందిన తీరు ముందు పలు అనుమానాలకు తావిచ్చింది. అనూహ్య రీతిలో ఆయన ఉరితాడుకు వేలాడుతూ మృతి చెందిన ఘటన పలువురిని నిశ్చేస్టులను చేసింది. వెనువెంటనే తహశీల్దార్ మృతికి దారి తీసిన పరిస్థితులపై మీడియా వర్గాలు, ప్రజా సంఘాల నేతలు, రాజకీయ ప్రతినిధులు ఆరా తీశారు. ఈ క్రమంలో ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి గోపాలకృష్ణ మందలింపులే తహశీల్దార్ మృతికి దారి తీసినట్లుగా పలువురి నుంచి ఆరోపణలు వినిస్తున్నాయి. పలువురు రెవెన్యూ ఉద్యోగులు కూడా దీన్ని సత్యమనే చెపుతున్నారు. ఈ నెల 5న ఐటీడీఏలో జరిగిన సమావేశంలో అందరి ముందు పిఒ మందలింపులతోనే తనకు అవమానం జరిగిందని, తాను చనిపోతానంటూ తహశీల్దార్ శ్రీనివాసరావు పలువురి వద్ద ఆవేదన వ్యక్తం చేస్తూ చెప్పినట్లు సమాచారం. శ్రీనివాసరావుకు కుటుంబ పరమైన, అనారోగ్య సమస్యలు ఏమీ లేవని భార్య, కుటుంబ సభ్యులు స్పష్టం చేశారు. తహశీల్దార్ శ్రీనివాసరావు భార్య శివ సరోజ మీడియాతో మాట్లాడినప్పుడు మానసిక ఒత్తిడి వలనే ఇలా చేసుకుని ఉండవచ్చునని అన్నారు. తహసీల్దార్ అనూహ్య మృతిపై శాఖపరంగా అధికారులు ఎటువంటి విచారణ చేపట్టలేదు. కానీ, ఈ సంఘటన జరిగిన మరుసటి రోజే పెదబయలు మండల రెవెన్యూ కార్యాలయంలోని ఉప తహశీల్దార్, సీనియర్ అసిస్టెంట్లను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడం ఈ ప్రాంతంలో చర్చ నీయాంశం అయింది.ఐటీడీఏ పీవో మందలింపులే తహశీల్దార్ బలవరణ మరణానికి ప్రబల కారణంగా ప్రజా సంఘాలు, ఉద్యోగ వర్గాలు నిక్కచ్చిగా



విశ్వసిస్తున్నాయి. నిస్సందేహంగా పిఒ హెచ్చరికల మూలంగానే మానసిక ఒత్తిడికి గురైన శ్రీనివాసరావు ఈ దారుణానికి పాల్పడ్డారని చెబుతున్నారు.

పాడేరు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి పలువురు డివిజనల్ అధికారులు, ఉద్యోగులపై కూడా అహంకారపూరితంగా వ్యవహరిస్తున్న తీరుపై పలు విమర్శలు ఉన్నాయి. ఇటీవల ఐటిడిఏ కార్యాలయంలోని ప్రధాన విభాగంలో కొందరు విజిటర్స్ (ఉద్యోగులు) లోపలకు వెళ్లి అక్కడ ఉన్న అధికారులతో మాట్లాడుతున్న సందర్భంగా పిఒ గమనించి సందర్శకులను లోపలకు ఎందుకు రప్పిస్తున్నారని ప్రశ్నించి ఆ విభాగంలో ఉన్న ఉద్యోగులందర్నీ బయటకు రప్పించి మిమ్మల్ని అందరిని సస్పెండ్ చేస్తానంటూ హెచ్చరికలు చేసినట్లు తెలిసింది. అధికారులు అని చూడకుండా తీవ్ర పదజాలంతో ఐటీడీఏ పీవో హెచ్చరికలు చేస్తుంటారని పలువురు చెబుతున్నారు. ఎదుటివారికి మనస్థాపం కలిగించే రీతిలో పిఒ వ్యవహార శైలి ఉంటుందని పలువురు ఆరోపిస్తున్నారు.ఆశ్రమ పాఠశాలలకు తనిఖీకి వెళ్ళినప్పుడు ఉపాధ్యాయుల పట్ల కూడా పిఒ తీరు ఇలాగే ఉంటుందని పలువురు అంటున్నారు. ఆశ్రమ పాఠశాలల్లోకి ఎవరిని అనుమతించకూడదని ఉపాధ్యాయులపై పీవో ఒత్తిడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. పిఒ ఐటీడీఏ స్థాయిలో తలపెట్టిన గిరివిజ్ఞాన సంబరాలను కూడా జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని వాయిదా వేసినట్లు తెలిసింది. ప్రాజెక్ట్ అధికారి పై పలు ఆరోపణలతో పాటు పాలనా తీరుపై పలు విషయాలను ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళుతున్న నేపథ్యంలో కలెక్టర్ తగు చర్యలకు ఆదేశాలిస్తున్న క్రమంలో పీవో దూకుడుకు కొంత కళ్లెం వేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది.

విచారణ చేపట్టకుండానే..
గిరిజన ఉద్యోగుల సస్పెన్షన్


- ఎపి గిరిజన సంఘం, గిరిజన సమాఖ్య నేతలు

ప్రజాశక్తి-పాడేరు: పెదబయలు మండలం తహశీల్దార్ మృతిపై సమగ్రమైన విచారణ జరపకుండా ఈ కార్యాలయానికి చెందిన ఇద్దరు గిరిజన ఉద్యోగులను సస్పెండ్ చేయడం సరికాదని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కొమ్మ పృథ్వీరాజ్, ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి కూడ రాధాకృష్ణ ప్రభుత్వం తీరును తీవ్రంగా ఖండించారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ, పెదబయలు మండల తహసీల్దార్ మృతి పై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. ఆయన మృతిపై గిరిజన ప్రజా సంఘాలు సమగ్ర విచారణకు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ఐటిడిఏ పిఒను రక్షించడం కోసం పెదబయలు మండలంలో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్ ను సస్పెండ్ చేయడం అన్యాయమన్నారు. ఈ క్రమంలో గిరిజన ఉద్యోగులను సస్పెండ్ చేయడం, ఇక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులకు తప్పుడు సంకేతాలు ఇస్తుందన్నారు. కుటుంబాలను వదిలేసి గిరిజన ప్రాంతంలో విధులు నిర్వహించడానికి వస్తున్న అధికారులకు మనోధైర్యం, ఆత్మ అభిమానాన్ని ఇనుమడించేలా ఉన్నతాధికారులు వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. తహశీల్దార్ మృతిపై సమగ్ర విచారణ నిర్వహించి బాధ్యులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రూ.151 కోట్లతో భవనాల నిర్మాణాలు

- పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ తమ్మర్ల కొండయ్య పడాల్

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లాలోని పాడేరు డివిజన్ లో అరకు, పాడేరు నియోజకవర్గాల పరిధిలో సుమారు రూ.151 కోట్ల రూపాయల వ్యయంతో పెద్ద ఎత్తున భవన నిర్మాణాలను చేపట్టినట్లు పంచాయతీరాజ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తమ్మర్ల కొండయ్య పడాల్ వెల్లడించారు. పాడేరు అరకు నియోజక వర్గాల వారీగా గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, కోసం చేపట్టిన 542 భవనాల నిర్మాణాల ప్రగతిపై ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.





సచివాలయాల భవనాల నిర్మాణం

ఏజెన్సీలో రూ. 84 కోట్ల 80 లక్షలతో 212 గ్రామ సచివాలయ భవనాలు నిర్మాణం చేపట్టాం. పాడేరు నియోజకవర్గంలో 97 భవనాలు, అరకు నియోజక వర్గంలో 115 భవనాలు నిర్మాణాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం వీటిలో 25 భవనాల నిర్మాణం పూర్తి చేసి అప్పగించాం.

ఆర్‌బికెలు ఎన్ని చేపట్టారు

పాడేరు నియోజకవర్గంలో 94 అరకు నియోజకవర్గంలో 115 చొప్పున మొత్తం 209 రైతు భరోసా కేంద్రాల నిర్మాణం చేపట్టాం. వీటి నిర్మాణానికి రూ.45 కోట్ల 56 లక్షలు వ్యయమవుతోంది. వీటిలో 15 భవనాలు నిర్మాణం పూర్తి చేశాం.

విలేజ్ హెల్త్ క్లినిక్‌లు చేపట్టినవి

రూ.21 కోట్ల 17 లక్షల 50 వేల వ్యయంతో 121 విలేజ్ హెల్త్‌క్లినిక్‌లకు భవన నిర్మాణాలు ప్రారంభించాం. అరుకు నియోజకవర్గంలో 71 భవనాలు పాడేరు నియోజక వర్గంలో 50 భవనాలు నిర్మాణం చేపట్టాం. వీటిలో ప్రస్తుతం ఐదు భవనాలు పూర్తయ్యాయి. ఏజెన్సీ వ్యాప్తంగా చేపట్టిన ఈ భవనాల నిర్మాణం మార్చి నాటికి పూర్తవుతుంది.

గిరిజన విద్యారంగ సమస్యలపై

నేడు ఐటిడిఎల ముట్టడి

- పాడేరు, చింతూరు, రంపచోడవరంల్లో యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసనలు

ప్రజాశక్తి-పాడేరు: గిరిజన విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 12న సోమవారం ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ఐటిడీఏల ముట్టడి కార్యక్రమం చేపట్టింది. ఈ మేరకు జిల్లాలోని పాడేరు, చింతూరు, రంపచోడవరం, ఐటీడీఏల ఎదుట యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించేందుకు సమాయత్తమయ్యారు. దీర్ఘకాలంగా గిరిజన విద్యా రంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం గత ఏడాదికాలంగా యుటిఎఫ్ ప్రత్యేక కార్యాచరణతో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా గత అక్టోబర్ 15 నుంచి 22 వరకు అన్ని ఐటిడిఎల పరిధిలో ఉన్న ఆశ్రమ పాఠశాలలను సందర్శించి సమస్యలు గుర్తించేందుకు యుటిఎఫ్ బృందాలు జీపుజాతా ద్వారా పర్యటించాయి. గిరిజన విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించే క్రమంలో నవంబర్ 20న అల్లూరి జిల్లా కేంద్రమైన పాడేరులో యుటిఎఫ్ రాష్ట్ర విద్యా సదస్సును కూడా నిర్వహించింది.

గిరిజన విద్యారంగ సమస్యల పరిష్కారంలో అటు ప్రభుత్వం, ఇటు అధికార యంత్రాంగం తీవ్ర అలసత్వం వహించడంపై యుటిఎఫ్ రాష్ట్ర విద్యా సదస్సులో చేసిన తీర్మానం మేరకు ఈ నెల 12న ఐటీడీఏల ముట్టడి చేపట్టనుంది. ముఖ్యంగా గిరిజన ఆశ్రమ పాఠశాలల్లోని వసతి గృహాల్లో వార్డెన్లు, కుక్‌లు, కమాటీలు, నియామకం చేపట్టాలని విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలని, కాస్మోటిక్ చార్జీలు పునరుద్ధరించాలని భాషా పండిట్ల అప్ గ్రేడేషన్ నిర్వహించాలని గిరిజన సంక్షేమ శాఖలో ఉపాధ్యాయులకు డీఈవో, ఎంఈఓ, ప్రమోషన్లు కల్పించాలని యుటిఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. అలాగే భాషా పండిట్ల అప్ గ్రేడేషన్, భాషా వాలంటీర్లను కొనసాగింపు, రిక్రూట్మెంట్లు, ఆశ్రమ పాఠశాలలను ప్లస్ టుగా స్థాయి పెంచాలని తదితర డిమాండ్లతో గిరిజన విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం యుటిఎఫ్ ప్రభుత్వంపై పోరు సాగిస్తోంది.



ప్రదర్శన చేపడుతున్న యుటిఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు (ఫైల్ ఫోటో)

ఉపాధ్యాయులు తరలి రావాలి

గిరిజన ఉపాధ్యాయులు విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 12న తలపెట్టిన ఐటిడీఏ ముట్టడి కార్యక్రమానికి ఉపాధ్యాయులందరూ తరలి వచ్చి విజయవంతం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.మహేష్ పిలుపునిచ్చారు. జిల్లాలోని మూడు ఐటిడీఏలలో ఉపాధ్యాయులు ఈ కార్యక్రమాలను నిర్వహించి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని పిలుపునిచ్చారు గిరిజన విద్యారంగ సమస్యలపై 18సార్లు యూటీఎఫ్ ఆధ్వర్యంలో అధికారులకు మెమోరాండం ఇచ్చామని, నవంబర్ 20న పాడేరులో నిర్వహించిన రాష్ట్ర విద్యా సదస్సు అనంతరం మరొకసారి అధికారులకు వినతి పత్రం అందించినా ఇంతవరకు ఒక్క సమస్య కూడా పరిష్కారం చేయలేదన్నారు. గత నాలుగేళ్లుగా గిరిజన పాఠశాలల్లో ఉన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోవడంతో గిరిజన విద్యార్థి, ఉపాధ్యాయ వర్గాల్లో ఆందోళన నెలకొందని చెప్పారు. గిరిజన విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని కదిలించేందుకు గిరిజన ఉపాధ్యాయ వర్గాలు, సిఆర్‌టి లు, భాష వాలంటీర్లు పెద్ద ఎత్తున తరలి వచ్చి ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



వి.మహేష్, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

మావోయిస్టు ప్రభావిత గ్రామాల్లో
ఎఎస్‌పి విస్తృత పర్యటన

- సంజీవని వైద్యశిబిరం, యువహో వాలీబాల్ టోర్నీపై ప్రచారం



గిరిజనులతో మాట్లాడుతున్న ఎఎస్‌పి ప్రతాప్ శివకిశోర్

ప్రజాశక్తి -సీలేరు: మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఆదివారం చింతపల్లి డివిజనల్ ఎఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్ విస్తృతంగా పర్యటించారు. దారకొండ, సీలేరు వారపు సంతల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. రామాలయం సెంటర్లో సీలేరు కాన్వెంట్ విద్యార్థులతో మమేకమై విద్య, ఇతర విషయాలను ముచ్చటించారు. వారపుసంతకు వచ్చిన గిరిజనులతో అనేక విషయాలపై కాసేపు చర్చించారు. సీలేరులో గిరిజనులు సంతకు తీసుకువచ్చిన నిత్యావసర కూరగాయలను ఆసక్తిగా తిలకించారు. జికె.వీధి మండలం మాదిగమల్లులో పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించే సంజీవని మెగా వైద్య శిబిరం, యువహో వాలీబాల్ క్రీడాపోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని వారపు సంతల్లో ఎఎస్‌పి ప్రతాప్ శివకిశోర్, సిఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం చేశారు. గిరిజనులకు ఎఎస్‌పి స్వయంగా కరపత్రాలను అందించారు.కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో పాల్గొనేవారికి ఉచితంగా భోజన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఇప్పటికే ధారకొండ, సీలేరు గుమ్మరేవులు తదితర పంచాయతీల్లో వాలీబాల్ క్రీడాకారులు, జట్లకు సమాచారం చేరవేసేలా పోలీస్ శాఖ అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

ఎడిఇకు ఘన వీడ్కోలు



సుధీర్‌ను సత్కరిస్తున్న జెన్‌కో ఇంజినీర్లు, తదితరులు

ప్రజాశక్తి -సీలేరు: బదిలీ అయిన జీకే వీధి మండలం సీలేరు ఎపి జెన్‌కో డ్యాం, పవర్ హౌస్ ఎడిఇ సుధీర్ వీడ్కోలు కార్యక్రమాన్ని జెన్‌కో అతిధి గృహంలో నిర్వహించారు. ఆదివారం ముఖ్య అతిథులుగా ఎపి జెన్‌కో ఎస్ఇ (సివిల్) కెకెవి.ప్రశాంత్‌కుమార్, ఇఇ జాకీర్ హుస్సేన్, స్థానిక ఎంపిటిసి పిల్ల సాంబమూర్తి పాల్గొనినెల్లూరు కృష్ణపట్నం ప్రాజెక్టుకు బదిలీ అయిన ఎడిఇ సుధీర్‌ను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. క్యాంపు ఎడిఎ అప్పలనాయుడు. ఎఇ సురేష్, సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు, పలువురు ఇంజనీర్లు కాంట్రాక్ట్ కార్మికులు శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఇఇ జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ బదిలీ ఎడిఎ సుధీర్ తనకు మంచి మిత్రుడని, ఎఇ నుంచే తన వద్ద విధులు నిర్వర్తించారని, ఎపుడూ నిరాడంబరంగా, విధులు పట్ల అంకితభావంతో పనిచేసేవారన్నారు. తన దగ్గర ఏఈగా విధులు నిర్వహించారని విధి నిర్వహణలో నిడారంబరంగా వ్యవహరిస్తూ ఉండేవాడని కొనియాడారు.ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ, తల్లిదండ్రులు బాగోగులు చూసుకోవడానికి బదిలీపై వెళ్తున్నట్లు వెల్లడించారు.


వైభవంగా 'మన బడి' స్వర్ణోత్సవం

- కుటుంబాలతో తరలివచ్చిన పూర్వ విద్యార్థులు

నాటి గురువులకు ఘన సత్కారం

ప్రజాశక్తి -చింతూరు : చింతూరు డివిజన్ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజులు నిర్వహించిన పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవ సంబరాలు రెండవ రోజు ఆదివారం ఘనంగా ముగిశాయి. 1981 నుంచి నేటివరకు విద్యాబుద్ధులు నేర్పిన మాస్టార్లను పూర్వ విద్యార్థులు పూల మాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించి గురుభక్తిని చాటుకున్నారు. సుమారుమూడు వేల మంది పూర్వ విద్యార్థులు, పిల్లలు కుటుంబ సమేతంగా ఈ వేడుకలకు హాజరై, పరస్పరం పలకరించుకొని కష్టసుఖాలు తెలుసుకున్నారు. పాఠశాలలో చదువుకున్న రోజులను గుర్తుకు తెచ్చుకొని గురువులు చెప్పిన పాఠాలు గుర్తుపెట్టుకునిచ నేడు అత్యున్నత స్థానాలలో వివిధ ఉద్యోగ, వ్యాపార రంగాలలో రాణించారు.

తాము చదువుకున్న బడి నివసించిన పల్లె ఒడిని చూసి పులకించిపోయారు. గురువులకు పాదాభివందనాలు చేస్తూ, ఒకరికొకరు ఆలింగనం చేసుకొని పలువురు విద్యార్థులు ఆనందభాష్పాలతో మైమరిచిపోయారు. 50 మంది పూర్వ ఉపాధ్యాయులను వేదికపై ఆహ్వానించి



విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు



ఆదవాసీ సాంప్రదాయ వేషధారణలో సందడి చేస్తున్న పూర్వ విద్యార్థులు

ఘనంగా సత్కరించారు. తెలంగాణ రాష్ట్రం పరకాల ఎసిపిగా అత్యున్నత స్థానంలో ఉన్న 1985 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థి జూపల్లి శివరామయ్య, 1991 బ్యాచ్‌కు చెంది, తెలంగాణ రాష్ట్రం డోర్నకల్ సీఐ గా విధులు నిర్వహిస్తున్న చింతూరు విద్యార్థి జూపల్లి వెంకటరత్నం వేడుకలో పాల్గొని, గురువులను సత్కరించడం, తోటిమిత్రులతో ఆనందంగా గడపడం ద్వారా ఈ వేడుకకు ప్రత్యేకతను తెచ్చారు.. విదేశాల్లో ఉన్న పూర్వవిద్యార్థులు కూడా హాజరై ఈ వేడుకలను తిలకించి పులకించిపోయారు.



ఉన్నత పోలీసు ఉద్యోగాల్లో జూపల్లి వెంకటరత్నం,శివరామయ్య


పూర్వ విద్యార్థుల ఆదరాభిమానాలు మర్చిపోలేనివి



ఖమ్మం జిల్లాలో ఉన్నపుడే చింతూరు ఉన్నత పాఠశాలలో 1974లో ఉపాధ్యాయుడుగా చేరాను. అక్షరాస్యతతో వెనుకబడి ఉన్న విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి తీర్చిదిద్దాను, 20ఏళ్ల తర్వాత ఇపుడు వారంతా గుర్తుపెట్టుకుని, సన్మానించడం ఎంతో ఆనందంగాఉంది.

మన్నేపల్లి వెంకటేశ్వర్లు, లెక్కలు మాస్టారు.

చింతూరులో ఉపాధ్యాయ వృత్తి తృప్తినిచ్చింది



చింతూరు ఉన్నతపాఠశాల నుంచే ఉపాధ్యాయ ప్రస్థానం ప్రారంభమైంది. రవాణా సౌకర్యాలు లేని రోజుల్లోనే ఇక్కడకు వచ్చి విధులు నిర్వర్తించాను. గురువులంటే పిల్లలకు ఎంతో గౌరవం, ప్రేమ ఉండేది. ఇన్నాళ్ల తర్వాత ప్రియశిష్యులంతా స్వర్ణోత్సవ సంబరాలు చేయడం, గురుభక్తితో ఆహ్వానించడం సంతోషంగా ఉంది.

ఎం సత్యనారాయణ, సైన్స్ మాస్టారు.

అరాచక వైసిపికి బుద్ధి చెప్పండి



ఇదేం ఖర్మ రాష్ట్రానికి ఇంటింటి ప్రచారంలో టిడిపి నేతలు

ప్రజాశక్తి - రంపచోడవరం : అభివృద్ధి, సంక్షేమాన్ని పక్కదారి పట్టించి, అరాచక పాలనతో రాష్ట్రాన్ని అధోగతిపాలుజేస్తున్న వైసిపి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని మండల టిడిపి అధ్యక్షుడు కారం సురేష్‌బాబు పిలుపునిచ్చారు. ఆదివారం రంపచోడవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి ఆదేశాలతో రంపచోడవరం మండలంలో తాటివాడ పంచాయతీ గోగుమిల్లి , బూరుగుబంద, తాటివాడ తదితర వైసిపి పాలనలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వైసిపి ప్రభుత్వ అనైతిక విధానాలను వివరించి చెప్పారు. రాజధాని లేని రాష్ట్రాన్ని చేసి, పేదోడికి ఒక్క ఇళ్లు కూడా కట్టకుండానే అన్నీ దౌర్భాగ్యాన్ని కల్పించిన వైసిపి ప్రభుత్వం నవరత్న పథకాలతో నయవంచన చేస్తోందన్నారు.వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు ప్రజలంతా ఎదురుచూస్తున్నారన్నారు. కార్యక్రమంలో అరకు పార్లమెంటరీ నియోజకవర్గ ఎస్‌టి సెల్ అధ్యక్షులు కారం సింహాచలం, ఎంపిటిసిలు చంద్రు వసంతకుమారి, నిరంజని దేవి, మాజీ సర్పంచ్ సోమన్న దొర, గ్రామ కమిటీ అధ్యక్షులు శీర్షం అబ్బులుదొర, శీర్షం సూరిబాబు, కారం అబ్బాయి దొర, మాజీ సర్పంచ్ కారం పాపారావు దొర, చక్రపాణి, బాబి, నాగన్న దొర, శిరసం తాతబ్బాయి, బరగ నాగమణి, కోటం ఆదిలక్ష్మి, అంజూరి విజయలక్ష్మి, బొరగా ధనలక్ష్మి, కారం బుల్లియమ్మ, బొరగా పొట్టిదొర, కోటం వెంకటేశ్వర్లు, ఐటిడిపి కోఆర్డినేటర్ పండు, యూనిట్ ఇన్‌ఛార్జి బాపన్న దొర పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలన అధ్వానంగా ఉందని టిడిపి ఆరుకు పార్లమెంటరీ ఉపాధ్యక్షులు డి శివరామచంద్రరాజు, లబర్తి ఎంపిటిసి, టీడీపీ మండల అధ్యక్షులు జి పెద్దిరాజు అన్నారు ఆదివారం మండలంలోని లబ్బర్తి పంచాయతీలోఅరకు పార్లమెంటరీ ఉపాధ్యక్షులు డి శివరామచంద్రరాజు ఆధ్వర్యంలో మండల టిడిపి అధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు అధ్యక్షతన 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామంలో టిడిపి నేతలు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసిపి పాలనలో ప్రజలను వేధిస్తున్న పది అంశాలపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. లబ్బర్తి వైస్ సర్పంచ్ బి రాజేశ్వరి,వార్డ్ మెంబర్లు సూరిశెట్టి కుమారి, పసగడుగుల తేజ, ఈక ఆదినారాయణ, జీరెడ్డి రాంబాబు, మాజీ ఎంపిటిసి ఎం సోమినాయుడు, కార్యకర్తలు రెడ్డివరహాలు, లోకారపు కనక, శ్రీను,రెడ్డి రాజు, గాడి శ్రీను, పి చిన రాజు, జి సత్తిబాబు, ఎట్ల అప్పలరాజు, జెట్టి మధు, ఎం. శ్రీను పాల్గొన్నారు.

దిగొచ్చిన కూరగాయల ధరలు

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరు వారపు సంతలో కూరగాయలు ధరలు సామాన్య మానవుడికి అందుబాటులోకి వచ్చాయి. దుప్పిలివాడ, పిల్లి గడ్డ, కాట్రగెడ్డ, జొన్న మామిడి గిరిజన గ్రామాల్లో గిరిజనలు పండించిన అన్ని రకాల కూరగాయలు సీలేరు వారం సంతకు తెచ్చి విక్రయాలు జరిపారు. గత రెండు వారాలతో పోలిస్తే టమోటా, కాలీఫ్లవర్, క్యారెట్, బీట్‌రూట్, ఇతర కూరగాయల ధరలు తగ్గి అందుబాటులోకి రావడంతో జెన్‌కో ఉద్యోగులతోపాటు, స్థానిక గిరిజనులు కొనేందుకు ఆసక్తి చూపారు.

వర్షంతో వారపుసంతకు ఇక్కట్లు

కాగా ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండకాసినప్పటికీ మధ్యాహ్నం రెండు గంటల తర్వాత వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని, పూర్తిస్థాయిలో మేఘావతమై వర్షం కురిసింది. దీంతో వారపుసంతకు వచ్చిన వినియోగదారులు, గిరిజన రైతులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షంతో వారపుసంతకు చివరి వరకు సాగని పరిస్థితుల్లో గిరిజన రైతులు తెచ్చిన కూరగాయలు, ఇతర వస్తువులు అమ్ముడుపోక, తిరిగి ఇళ్లకు తీసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని వాపోయారు.



వారపుసంతలో కూరగాయల దుకాణాలు

బోయ, వాల్మీకిలను

ఎస్‌టి జాబితాలో చేర్చితే ఆదివాసీలకు నష్టం

ప్రజాశక్తి-పాడేరు : బోయ. వాల్మీకి, ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చితే ఆదివాసులు నష్టపోతారని అఖిల భారత ఆదివాసి ఉద్యోగుల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు మధుకర్ ఉయికే అన్నారు. పాడేరు సిఎ హెచ్ స్కూల్ మీటింగ్ హాల్‌లో జరిగిన ఏఐఏఈ ఎఫ్ జాతీయ సమావేశంలో పాల్గొన్న మధుకర్ ఉయికే బోయ, వాల్మీకి కులాలను ఎస్టీ జాబితాలో చేర్చడాన్ని నిరసిస్తూ ఈనెల 30 న జరగనున్న ఆదివాసి గర్జన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బోయ, వాల్మీకి కులాలను చేర్చడానికి 52 జీవో ద్వారా కమిషన్‌ను నియమించిందని, 5వ షెడ్యూల్డ్ నాన్ ట్రైబల్‌కు పట్టాలు ఇవ్వడానికి ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. జీవో నెంబర్ 3 రద్దు, కాంట్రాక్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయపోవడంతో తెలుగు రాష్ట్రాల ప్రజలపై తీవ్ర ప్రభావం పడుందన్నారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు రాజా మార్కండేయ, చిట్టాపులి ఏపీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ పడాల్ సోమేలి సింహాచలం, అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షులు గదవారి సోంబాబు, రాష్ట్ర కమిటీ సభ్యులు కుర్ర మల్లేశ్వరరావులు, జాతీయ ప్రధాన విజయ్ కోకోడే, మహారాష్ట్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ దేవా పవర్ (మహారాష్ట్ర) సాదేసింగ్ కొమ్రే (ఛత్తీస్‌గఢ్), ఈశ్వర్ దుర్వే కోశాధికారి(మహారాష్ట్ర) జితేందర్ దుర్వే, లక్ష్మణ్ బాగా గుట్కార్ వివిధ రాష్ట్రాల ప్రతినిధులు రాష్ట్ర జిల్లా కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రవీణ్ కుమార్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండలంలోని దారెల గ్రామానికి చెందిన చెట్టి ప్రవీణ్ కుమార్ ఆంధ్ర విశ్వ విద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా పొందాడు. ఆంధ్ర విశ్వ విద్యాలయంలో అర్థశాస్త్ర విభాగ ఆచార్యులు పర్యవేక్షణలో సహజ ప్రకృతి సాంప్రదాయ వ్యవసాయంపై విశేష పరిశోధనలు చేశానని తెలిపాడు. ఈ మేరకు ఆంధ్ర విశ్వ విద్యాలయం నుంచి డాక్టరేట్‌ను పొందానని, ఏయూ ఉపకులపతి చేతుల మీదగా అందుకున్నట్లు ప్రవీణ్ కుమార్ ఆదివారం స్థానిక విలేకరులకు తెలిపారు. ప్రస్తుత వాతావరణ, ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా వ్యవసాయంలో రైతులకు తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు వచ్చే విధంగా కృత్రిమ వ్యవసాయానికి, సాంప్రదాయ వ్యవసాయనికి మధ్య సృజనాత్మక పరిశోధన చేశానన్నాడు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో రైతులకు అధిక దిగుబడులు వచ్చి ఆర్థికంగా బలపరుస్తుందని తెలిపారు. కృత్రిమ వ్యవసాయంతో భూ సారవంతం పెంచి నాణ్యమైన దిగుబడులు వస్తాయని పేర్కొన్నారు. ప్రవీణ్ కుమార్ ను గ్రామస్తులు, కుటుంబ సభ్యులతో పాటు పలువురు అభినందనలు తెలిపారు.


పట్టాను స్వీకరిస్తున్న ప్రవీణ్‌కుమార్

దళిత మహిళలపై అత్యాచారాలు అరికట్టాలి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:దళిత మహిళలపై అత్యాచారాలను అరికట్టాలని రెల్లి హక్కుల సాధన కమిటీ జిల్లా మహిళా కార్యదర్శి యర్రంశెట్టి మౌనిక డిమాండ్ చేశారు. చెట్టుపల్లి గ్రామంలో విలేకర్లతో ఆమె ఆదివారం మాట్లాడుతూ, మహిళల రక్షణకు కఠిన చట్టాలు ఎన్ని ఉన్నా అవి సక్రంగా అమలు కాలేదని, అందుకే నేరాలు అధికమవుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం మహిళల రక్షణకు ఎస్సీ కఠిన చట్టాలు, గృహహింస వరకట్నం, దిశ చట్టం, కాల్ సెంటర్లు ఉన్నప్పటికీ అవి అమలు చేయడంలో విఫలమవుతున్నాయని మౌనిక ఆవేదన వ్యక్తం చేశారు. దిశ చట్టం ఎంతో పటిష్టంగా అమలు చేయాలన్నారు. మహిళల పోరాటాలతో చట్టాలు తీసుకు వస్తే వాటిని కొంతకాలానికే పరిమితం చేస్తున్నారన్నారు. కొందరి ఒత్తిడిల కారణంగా చట్టాలు చుట్టాలుగా మారుతున్నాయన్నారు. చట్టాలు కఠినంగా అమలు చేసినప్పుడు నేరాలు చేసే వారిలో భయం పుడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యవతి, కనక లక్ష్మి, వరలక్ష్మి మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బహుజనులు ఏకతాటిపై నడవాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ :స్థానిక రోటరీ క్లబ్‌లో బీఎస్పీ ట్రేడర్ క్యాంప్‌ను ఆ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ బొట్ట నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బిఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు జె.పరంజ్యోతి మాట్లాడుతూ, బహుజనులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు రాజ్యాధికారం చేపడితేనే దేశంలో, రాష్ట్రంలోనూ స్వేచ్ఛ వస్తుందని తెలిపారు.

ఈదురు గాలులు.. చిరుజల్లులు

ధాన్యాన్ని కాపాడుకునేందుకు అష్ట కష్టాలు


అడారిమెట్ట పొలాల్లో వరి కుప్పలపై కప్పిన టార్పాలిన్లు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: తుపాను ప్రభావంతో మూడు రోజులుగా జిల్లా వ్యాప్తంగా చిరు జల్లులు పడ్డాయి. ఈదురు గాలులు ప్రభావంతో పలు ప్రాంతాల్లో వరి చేలు నేలకొరిగాయి. చేతికి అంది వచ్చిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు సాగుదారులు అష్ట కష్టాలు పడుతున్నారు. ఇప్పటికే నూర్పిన ధాన్యం రాశులను వర్షానికి తడవకుండా బరకాలతో కప్పేందుకు నానా తంటాలు పడుతున్నారు. దీనికి తోడు కూలీల కొరత ఏర్పడింది. కోసిన వరి పనలను కుప్పలు వేయాలన్న, ధాన్యం ఆరబెట్టాలన్నా ఇక్కడ తరలించాలన్న సమయానికి కూలీలు దొరక లేదు. పలు గ్రామాల్లో కోతలు పూర్తవడంతో పంటను దాచుకునేందుకు, వరి కుప్పలు తడవకుండా కాపాడుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడు రోజులుగా మోస్తారు వర్షాలు కురవడంతో పంటలు తడవగా, కోసి వేసిన కుప్పలపై టార్పాలిన్లు కప్పి ధాన్యాన్ని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.

హుకుంపేట:రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పొలాల్లో వరి పనలు తడవడంతో రైతులు లబోదిబో మంటున్నారు.సంవత్సరం అంతా కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయంలో తుపాను కారణంగా నష్టపోవడంతో రైతులు వాపోతున్నారు. వర్షానికి తడవకుండా తార్పాలు కప్పారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు.


హుకుంపేటలో తడిసిన వరి పనలు

రాష్ట్రంలో అరాచక పాలన

టిడిపి రాష్ట్ర ఎస్‌టి సెల్ కార్యదర్శి గబ్బాడ సింహాచలం


కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-పాడేరుటౌన్: వైసిపి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందని టిడిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర కార్యదర్శి గబ్బాడ సింహాచలం తెలిపారు. ఆదివారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులోని గుడివాడలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో రాష్ట్ర ప్రయోజనాలకు కలుగుతున్న తీవ్ర నష్టాలను, ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి చేయకపోగా, సంక్షేమం మాటున ప్రజలను మోసం చేస్తూ రాష్ట్ర ప్రయోజనాలు నాశనం చేస్తుందని విమర్శించారు.

హుకుంపేట:ప్రభుత్వ అసమార్ధ పాలనతో ప్రజల అవస్థలు పడుతున్నారని అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి, సర్పంచ్ బి.వెంకట రమణ రాజు అన్నారు. బాకూరు గ్రామ పంచాయతీలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిత్యావసరాలు ధరలు పెరగడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గ్రామంలో పర్యటించి సమస్య లను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం పట్టించుకోలేదని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నియోజక వర్గ కార్యదర్శి బి.మోహన్ రాజు, టిఎన్ఎస్ ఎఫ్ మండల కార్యదర్శి డి.రవి ప్రసాద్, బి.సావిత్రమ్మ (వార్డు మెంబర్), బి.బుల్లిరాజు, బి.నాగభూషణం రాజు, బి.ఈశ్వర్ రాజు, బి.తులసి రాజు, ఆర్.కొండబాబు, బి. అప్పలరాజు, ఆర్.చిన్నారావు, బి. మత్యరాజు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చెరుకు రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి -రావికమతం: చెరుకు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షులు గెంజ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ, గోవాడ షుగర్స్ ఫ్యాక్టరీలో రైతులను ఆదుకునేందుకు గాను ముందుగా వారికి పెట్టుబడి నిమిత్తం సొమ్మును చెల్లించి, చెరుకును ఫ్యాక్టరీకి తీసుకోవాలని తెలిపారు. కనీసం టన్నుకు రూ.3500 తక్కువ లేకుండా చెల్లించాలని డిమాండ్ చేశారు. చెరుకు ఫ్యాక్టరీకి తరలించిన 15 రోజుల్లోపు బకాయిలు చెల్లించాలని తెలిపారు. గత ఏడాది రైతులు 100శాతం చెరకు పంట వేస్తే ఈ ఏడాది కనీసం 60శాతం కూడా వేయలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది ఐదు లక్షల టన్నుల క్రషింగ్ లక్ష్యం కాగా ఈ ఏడాది కేవలం మూడు లక్షల 50 వేలకు తగ్గించడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని ఆరోపించారు.

రాయితీపై గడ్డి కోత యంత్రాలు

ప్రజాశక్తి-రోలుగుంట:3 బ్లేడ్‌ల విద్యుత్‌తో నడిచే జెడ్‌హెచ్‌పి సామర్థ్యం ఉన్న గడ్డి కోత యంత్రాలు (ఛాప్ కట్టర్)ను పాడి రైతులకు పశుసంవర్ధకశాఖ 40 శాతం రాయితీపై పంపిణీ చేస్తుందని స్థానిక పశుసంవర్ధకశాఖ అధికారి జి.నూకేశ్వరరావు పేర్కొన్నారు. ఈ మేరకు విలేకర్లతో ఆయన మాట్లాడుతూ, దీని ఖరీదు రూ.33970. రాయితీ రూ.13,588కాగా రైతు చెల్లించాల్సింది రూ.20,382. అధిక పాల ఉత్పత్తికి మెరుగైన ఉత్పత్తి సామర్థ్యంకు ప్రతీ పాడి రైతు తమ పశువులకు అందించే మేత 3/4 వంతు పచ్చగడ్డిని అందించాలని ఆయన అన్నారు. సూపర్ సేపియర్ బహువార్షిక పశు గ్రాసాలు సాగు చేసి ఛాప్ కట్టర్ ద్వారా ముక్కలు చేసి పశువులకు అందించడంతో మేత వృథాను అరికట్టడమే కాకుండా గడ్డిలో పోషకాలను పశువుల శరీరం సంపూర్ణంగా, సులభంగా గ్రహిస్తుందన్నారు. దీంతో అధిక ఉత్పత్తి, తక్కువ ఖర్చుతో రైతులకు ఆదాయం పెరుగుతుందన్నారు. వీటిని కావాల్సిన వారు రైతు భరోసా కేంద్రాలు లేదా సమీప పశువైద్యశాలలో ఆధార్ కార్డు పట్టాపుస్తకంతో సంప్రదించాలన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తకు అవార్డు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ఏఎల్‌పురం అంగన్వాడీ కార్యకర్త ఎం.మంగతాయి ఉత్తమ అవార్డు పొందారు. ఈ మేరకు అనకాపల్లిలో జిల్లా కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి, జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి చేతుల మీదుగా ఆమె అవార్డును అందుకున్నారు. నర్సీపట్నం ఐసిడిఎస్ ప్రాజెక్టు తరపున ఏఎల్‌పురం సెక్టార్ నుంచి ఎం.మంగతాయి, రోలుగుంట సెక్టార్ నుంచి ఎ.జయ, నర్సీపట్నం సెక్టార్ సిహెచ్.రామకృష్ణాదేవి ఉత్తమ కార్యకర్తలుగా ఎంపిక అయ్యారు.

ఎస్‌ఎస్‌ఎ కళాశాలలో ఎంట్రన్స్ పరీక్షలు

ప్రజాశక్తి- కోటవురట్ల:మండలంలో పాములవాక గ్రామంలో ఎస్ఎస్ఏ జూనియర్ కళాశాలలో ఈనెల 18 నుండి జనవరి 8 వరకు ఏపీ పోలీ సెట్, ఐఐఐటి, ఏపీఆర్జేసీ, ఎంట్రెన్స్ ఎగ్జామ్స్ నిర్వహిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ సాయికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎంట్రన్స్ పరీక్షల్లో మొదటి 10ర్యాంక్ సాధించిన వారికి ఉచితంగా కోచింగ్ ఇవ్వబడుతుందన్నారు.గతంలో కళాశాలలో నిర్వహించిన ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు సందర్భంగా తెలిపారు. కళాశాలలో హాస్టల్ వసతి సౌకర్యం కలగజేస్తున్నామని, ఆహ్లాదకరమైన వాతావరణంలో కోచింగ్ ఇస్తున్నట్లు తెలిపారు.

చెకుముకి సైన్స్ సంబరాలు

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:మండల కేంద్రంలోని వినయ్ విద్యా సంస్థలో అంగరంగ వైభవంగా చెకుముకి సైన్స్ సంబరాలు జరిగాయి. 20 మండలాల నుండి 150 మంది విద్యార్థులు హాజరు అయ్యారు. చెకుముకి సైన్స్ సంబరాల్లో ప్రథమ బహుమతి మాకవరపాలెం గిడుతురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ద్వితీయ బహుమతి ఏపీ మోడల్ స్కూల్ (వేములపూడి) సాధించాయి. ప్రైవేట్ పాఠశాల నుండి మొదటి బహుమతి శ్రీ ప్రకాష్ విద్యానికేతన్, ద్వితీయ బహుమతి భవాని విద్యానికేతన్ (అచ్యుతాపురం) గెలుచుకున్నాయి. మొదటి స్థానం సాధించిన వారు కడపలో జరుగు రాష్ట్ర స్థాయికి ఎంపిక అయ్యారు. ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర అధ్యక్షులు కే.త్రిమూర్తులు, వెంకటేశ్వర మాస్టారు, వినయ్ విద్యా సంస్థల కరస్పాండెంట్ బత్తులు వాసు, పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ కల్పనలో భాగంగా స్థానిక అల్లూరి సీతారామరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు.నిరుద్యోగ యువతలకు శిక్షణ ఇచ్చి అనంతరం ప్రముఖ ప్రైవేటు హాస్పిటల్స్‌లో ఉద్యోగం కల్పించనున్నారు.జెనరల్ డ్యూటీ అసిస్టెంట్ కోర్సును అందిస్తున్నారు. పదవ తరగతి అభ్యర్థులు అర్హులని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి చాముండేశ్వరావు తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్: 9000092227 నంబర్‌ను సంప్రదించాలన్నారు. బయో డేటా,ఆధార్ కార్డు, ఫోటోలతో స్కిల్ హబ్ వద్ద వద్ద సంప్రదించాలని తెలిపారు.

375వ రోజుకు మత్స్యకారుల ధర్నా

ప్రజాశక్తి -నక్కపల్లి:హెటిరో పైప్ లైన్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు ఇవ్వకూడదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. పైప్ లైన్ ఏర్పాటుకు వ్యతిరేకంగా మత్స్యకారులు చేపట్టిన శాంతియుత మహా ధర్నా ఆదివారం నాటికి 375వ రోజుకు చేరింది. వర్షం లోనూ మత్స్యకారులు ధర్నాను కొనసాగించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, కంపెనీ కాలుష్యం కారణంగా మత్స్యకారులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు.



మాట్లాడుతున్న జగ్గునాయుడు

ఉక్కు పరిరక్షణకు ఐక్య పోరాటాలు

ప్రజాశక్తి - ఉక్కునగరం

ఐక్యంగా పోరాడితే ఉక్కు పరిరక్షణ సాధ్యమేనని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అన్నారు. పోరాటాల ద్వారా సాధించుకున్న ఉక్కు పరిశ్రమను పోరాటాల ద్వారానే రక్షించుకుంటామని అన్నారు. స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ (సిఐటియు) 13వ మహాసభ రెండో రోజైన ఆదివారం ఆయన ముఖ్య వక్తగా ప్రసంగించారు. కార్మికులు, ప్రజలు తిరుగుబాటు చేస్తే ఎంతటి వాడైనా తలవంచక తప్పదన్నారు. మహాసభలో ప్రధాన కార్యదర్శి నివేదికను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇఎస్ఐలో మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఉక్కు అమ్మకాన్ని వెంటనే ఆపాలని, నిర్వాసితులకు న్యాయం చేయాలని పలు తీర్మానాలు చేశారు.

జనసేనలో యువత చేరిక

ప్రజాశక్తి - ఎటపాక : మురుమూరు గ్రామం నుంచి వివిధ పార్టీలకు చెందిన యువత చల్లకోటి రంజిత్ ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరారు. వారికి ఎటపాక మండల అధ్యక్షుడు మారాసు గంగాధర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మారాసు గంగాధర్ రానున్న రోజుల్లో మండల వ్యాప్తంగా మరిన్ని చేరికలు ఉంటాయని, తద్వారా జనసేన పార్టీ పూర్తిస్థాయిలో బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జనసేన మండల నాయకులు చల్లకోటి రంజిత్, పరిటాల విజయ్, చల్లకోటి శ్రీకాంత్, చల్లకోటి ప్రమోష్ , పల్లంటి వీరబాబు, గోలి శ్రీను, గద్దల సాయిరాం పాల్గొన్నారు.


ప్రాజెక్టు వివరాలు వెల్లడిస్తున్న ప్రతినిధులు

ప్లాస్టిక్ వేస్ట్ రీసైక్లింగ్ ప్రాజెక్టు ప్రారంభం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ నగర పరిధిలోని కాపులుప్పాడ డంపింగ్ యార్డ్‌లో ప్లాస్టిక్ వేస్ట్ రీసైక్లింగ్ ప్రాజెక్టును ఆదివారం ప్రారంభించారు. రోటరీ ఫౌండేషన్, రోటరీ క్లబ్స్, ఎన్‌జిఒలు, కార్పొరేట్ దాతల సహకారంతో ఏర్పాటైన ఈ ప్రాజెక్టుకు అరబిందో ఫార్మా రూ.25 లక్షలను విరాళంగా అందజేసిందని ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ఉదయ్ ఫిలానీ తెలిపారు. ప్లాస్టిక్ వినియోగాన్ని వేగంగా తగ్గించి, పర్యావరణాన్ని కాపాడేందుకు, ప్రపంచాన్ని భవిష్యత్తు తరాల కోసం కాపాడేందుకు మనం చేయగలిగిందంతా చేయాలని అన్నారు. ఈ ప్రాజెక్టు అమెరికాలో స్థిరపడిన విజయనగరానికి చెందిన వ్యర్థ పదార్థాల నిర్వహణలో ప్రముఖుడైన ప్రకాశం తాత ఆలోచన మేరకు చేపట్టడం జరిగిందన్నారు. సురక్షిత నీరు, అక్షరాస్యత, విద్య, ఆరోగ్య సంరక్షణ, ఆర్థిక సాధికారిత, పర్యావరణం వంటి రంగాలలో ప్రాజెక్టులను చేపట్టడంలో మొయినాబాద్‌కు చెందిన రోటరీ క్లబ్ ఆఫ్ లేక్ ఎంతగానో గుర్తింపు చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో మొయినాబాద్ క్లబ్‌కు చెందిన పతంజలిరావు, రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ రాజశేఖర్ రెడ్డి, అరబిందో సంస్థ నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కన్నన్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ సమాజాన్ని నిర్మిద్దాం

జెవివి చెకుముకి సైన్సు సంబరాల్లో వక్తలు


ప్రతిభ కనబరిచిన వారితో అతిథులు, నిర్వాహకులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జన విజ్ఞాన వేదిక (జెవివి) చెకుముకి సైన్సు సంబరాలు - 2022 ఆదివారం డాబా గార్డెన్స్ అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో అట్టహాసంగా జరిగాయి. ఉదయం ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ ఆర్.రమాప్రభ, పెందుర్తి గవర్నమెంటు పాలిటెక్నిక్ కళాశాల పిన్సిపాల్ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్ చేతుల మీదుగా చెకుముకి ప్రశ్నా పత్రాన్ని జెవివి విశాఖ కమిటీ సభ్యులు విడుదల చేశారు. అనంతరం 110 స్కూళ్ల నుంచి మండల స్థాయిలో టాపర్లుగా నిలిచిన 390 మంది విద్యార్థులు జిల్లా స్థాయి పరీక్ష రాశారు. డాక్టర్ రమాప్రభ వివిధ పాఠశాలల నుంచి వచ్చిన టీచర్లు, తల్లిదండ్రులతో ప్రస్తుత సామాజిక సమస్యలు, ప్రబలుతున్న అశాస్త్రీయ భావాలపై ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జెవివి నిర్వహించిన సైన్సు క్విజ్ పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ పోటీల అనంతరం జరిగిన సమావేశంలో ముఖ్య అతిథి ఎసోసియేట్ డైరెక్టర్ కమ్ సైంటిస్ట్-ఎన్ఎస్‌టిఎల్ మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాలు ఎంతగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ సమాజంలో అశాస్త్రీయ భావాలు కూడా అంతే స్థాయిలో పెరుగుతున్నాయని, ఈ తరుణంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండి సరైన రీతిలో విద్యాభ్యాసం చేయాలని, ప్రశ్నించేతత్వాన్ని, శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని కోరారు. మరో వక్త డాక్టర్ ఎం.రమేష్ కుమార్ మాట్లాడుతూ మూఢ నమ్మకాలు చాలా ప్రమాదకరంగా మారాయని, అవి చాలా మంది ప్రాణాలను తీస్తున్నాయని, విద్యార్థులు హేతుబద్ధ ఆలోచనా విధానం అలవర్చుకోవాలని కోరారు. విద్యార్థులు మాత్రమే శాస్త్రీయ సమాజాన్ని నిర్మించ గలరని అన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అతిథులుగా పాల్గొన్న సన్ ఫ్లవర్ స్కూల్ కరస్పాండెంట్ ఎంఎన్.కుమారి, సీనియర్ న్యాయవాది రామాంజనేయులు, జిల్లా సైన్స్ ఆఫీసర్ విశ్వేశ్వరరావు ప్రసంగించారు. అనంతరం చెకుముకి పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 12 పాఠశాలల విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అలాగే వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన జివిఎంసి స్కూల్ మల్కాపురం, లిటిల్ ఏంజిల్స్ స్కూల్ ఎంవిపి కాలనీ విద్యార్థుల టీంలను వచ్చే ఏడాది జనవరిలో కడపలో జరిగే రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్సు సంబరాలకు విశాఖ జిల్లా నుంచి ఎంపిక చేశారు. క్విజ్ పోటీలో వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన ఇండియన్ స్ప్రింగ్ స్కూల్ పెందుర్తి, లిటిల్ ఏంజిల్స్ స్కూల్ ఎంవిపి, భాష్యం స్కూల్ ఎన్ఎడి విద్యార్థులకు మెమెంటోలు, సర్టిఫికెట్లు, ప్రైజ్‌మనీ అందజేశారు. సైన్సు పరీక్షకు కన్వీనరుగా ఎస్‌వికె.పరశురాం, క్విజ్ పోటీ నిర్వహణకు కో - ఆర్డినేటరుగా ఇందు శ్రీనివాసన్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో జెవివి విశాఖ అధ్యక్షులు శుభాకర్, ప్రధాన కార్యదర్శి ఎంవిఆర్ఎస్.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


హాజరైన విద్యార్థులు

జర్నలిస్టులకు అవగాహన సదస్సులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రెస్ అకాడమీ ద్వారా గతంలో జర్నలిస్టులకు శిక్షణ తరగతులు నిర్వహించే వారని, వాటికి బదులు ఇప్పుడు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం వైజాగ్ జర్నలిస్టు ఫోరం ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో ఫోరం తరపున కొమ్మినేని శ్రీనివాసరావును సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన 'పాత్రికేయులు - సమకాలీన అంశాలు'పై మాట్లాడారు. జర్నలిస్టులు సమాజ హితులని అన్నారు. జర్నలిస్ట్ వృత్తిని ఇతర వాటితో పోల్చుకోవద్దన్నారు. జర్నలిస్టులలో వినూత్న పోకడలు అసలు ఉండకూడదన్నారు. వార్తలలో వాస్తవానికి వన్నె తెచ్చి ప్రజల మన్ననలు పొందాల్సిందేనన్నారు. జర్నలిజం అనేది పవిత్రమైన వృత్తి అని, అయితే తెలిసో తెలీకో ఈ వృత్తిలోకి వచ్చి కొనసాగుతున్న వారంతా పూర్తి అప్రమత్తంగా ఉండాలని అన్నారు. సమాజానికి హితం చెప్పే వారు జర్నలిస్టు అనేలా ఉండాలన్నారు. తన హయాంలో జర్నలిస్టులు అందరూ విలువలతో కూడిన జర్నలిస్టులుగా ఉండాలనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఏ వ్యవస్థ బాగున్నా, బాగుండకపోయినా జర్నలిజం వ్యవస్థ మాత్రం నిజాయితీతో ఉండాల్సిందేనన్నారు. ఒక్క రోజులోనే సమాజంలో మార్పు వస్తుందని ఆశించినక్కర్లేదన్నారు. సమాజంలోని మంచిని ఆశించే వారి కోసం, సమాజం మేలు కోసం జర్నలిస్టులు పాటుపడాలని సూచించారు.


వివరాలు వెల్లడిస్తున్న సిఐ స్వామినాయుడు

24 గంటల్లోనే చోరీ కేసు ఛేదన

- సిసి టీవీ ఫుటేజీ ఆధారంగా నిందితులు పట్టివేత
- కేడీపేట, కొయ్యూరు పోలీసుల సమన్వయంతో పట్టుబడ్డ దొంగలు

ప్రజాశక్తి -కొయ్యూరు : మండలంలోని డౌనూరు వద్ద ఈనెల 6న జరిగిన దారి దొంగతనం కేసును కొయ్యూరు పోలీసులు చేధించారు. దీనిపై ఈనెల9న బాధితుడు ఫిర్యాదు చేయగా, 24గంటల్లోనే దొంగలను పట్టుకుని శభాష్ అనిపించుకున్నారు.దీనికి సంబంధించిన కొయ్యూరు సిఐ స్వామినాయుడు వెల్లడించిన వివరాలివి. ఏజెన్సీ ప్రాంతంలో కిరాణా వ్యాపారం చేస్తున్న నర్సీపట్నం కొత్త వీధికి చెందిన ఎల్లపు గోవిందరావు ఈనెల 6వ తేదీన వ్యాపార నిమిత్తం ఉదయం 6 గంటల ప్రాంతంలో నర్సీపట్నంలో బయలుదేరి, డౌనూరు వద్ద బైకును ఆపి టిఫిన్‌చేసేందుకు వెళ్లాడు. నర్సీపట్నం పెట్రోల్ బంక్ నుంచి గోవిందరావును ఫాలో అవుతున్న దొంగలు, కొయ్యూరు మండలంలోని డౌనూరు మెయిన్ రోడ్డు వద్ద టిఫిన్ షాప్ వద్ద గోవిందరావు బైక్ ఆపడం చూసి, అతని బైక్ కవర్‌లో బ్యాగులో ఉన్న రూ.1.50లక్షలను దొంగిలించారు. డబ్బులు పోయినట్లు గ్రహించిన గోవిందరావు చుట్టుపక్కల ప్రాంతాల్లో దొంగల గురించి వెతికినా ఫలితం లేకపోవడంతో, ఈ నెల 9న కొయ్యూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కొయ్యూరు సిఐ స్వామినాయుడు ఆధ్వర్యంలో పోలీసులు రెండు బృందాలుగా దర్యాప్తు చేపట్టి, పాత నేరస్తుల కదలికలు, నర్సీపట్నం డౌనూరు వద్ద సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా అనుమానితుల ఫోటోలను కేడీపేటతోపాటు నర్సీపట్నం పరిధిలోని పోలీస్ స్టేషన్‌లకు పంపడంతోపాటు సోషల్ మీడియాలో పెట్టారు. వీటి ఆధారంగా కేడి పేట ఎస్ఐ, కానిస్టేబుల్ దుర్గా పసాద్, కుర్మారావు, ప్రసాద్ సహకరంతో దొంగలను గుర్తించారు. కొయ్యూరు సిఐ స్వామినాయుడు, ఎస్ఐ రాజారావు,ఇ తర సిబ్బంది సహకారంతో 10న మధ్యాహ్నం కొండ గోకిరి గ్రామశివారులో నిందితులను పట్టుకున్నారు. చోరీకి పాల్పడిన కేడీపేటకు చెందిన గంటా రవీంద్ర అలియాస్ రవి, వడ్డాది మాడుగులకు చెందిన గంటా భీమరాజు, కొత్తవలసకు చెందిన ఏలియా కుమార్‌లను పట్టుకుని, వారి నుంచి రూ.1.50 లక్షల నగదు,రెండు బైక్‌లు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు కొయ్యూరు సిఐ స్వామినాయుడు తెలిపారు.

నేడు భూముల రీసర్వేపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి- రాజవొమ్మంగి : దేవీపట్నం మండలం దేవారం గ్రామ పంచాయతీలో నెల 12న ఉదయం 10గంటలకు సమగ్ర భూసర్వేపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎంపిటిసి తుర్రం జగదీష్ దొర తెలిపారు. దేవారం పంచాయతీ పరిధిలోని పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు, రైతులందరూ సదస్సులో పాల్గొనాలన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని శరభవరం గ్రామానికి చెందిన నడిగట్ల ఎండయ్య(64) వైద్యం పొందుతూ మృతి చెందినట్లు స్థానిక ఎస్ఐ గోపి నరేంద్రప్రసాద్ తెలిపారు. రాజవొమ్మంగిలో గ్రామసహాయకుడిగా పనిచేస్తున్న ఎండయ్య రెండు రోజుల క్రితం తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లే మార్గంలో నడుచుకుంటూ వెళుతూ అంబేద్కర్ విగ్రహం వద్ద అదుపుతప్పి పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు అతనిని స్థానిక పిహెచ్‌సికి తరలించగా వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స చేసి, మెరుగైన వైద్యం నిమిత్తం రంపచోడవరం తరలించారు. అక్కడ నుండి రాజమహేంద్రవరం వైద్య విధాన పరిషత్‌కు తరలించగా వైద్యం పొందుతూ శనివారం సాయంత్రం మతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.